# సెక్సు సమస్య

## 1

"చూడండి, చూడండి, ఆ అమ్మాయికి మాయా ఛటర్జీ పోలికలు లేవూ? "

నేను తల ఊపేను.

"ఏడిసినట్టుంది. నేను ఏదంటే దానికి గంగిరెద్దులా బుర్ర ఊపుతారు, నా నోటికి జడిసి. ఆ అమ్మాయికీ మన మాయాకీ పోలికేమిటి నా మొహం! మాయా అప్పుడే ఎంతో తెల్లగా ఉండేది. ఈ పాటికి వయసుతో మరింత సొగసు వచ్చి మిసమిసలాడుతూ తయారయి ఉంటుంది ముండ. ఈ పాటికిగాని పెళ్ళి సమ్మంధాలు చూస్తున్నారో ఏమిటో..."

నేను ఏ విషయమూ పైకి తేలకూడని సందర్భం ఇది.

పన్నెండేళ్ళె దాచిన పరమ రహస్యం ఇది.

"చాకిరీ చేయించుకోడమే తప్ప–ఇన్నేళ్ళె కాపురం చేస్తోంది మీ ఆవిడకి నువ్విచ్చింది ఒక్కటంటే ఒక్కటైనా ఉందిటయ్యా" అని నా మనసు నన్ను నిలదీస్తే నేను చెప్పుకోగల పదిలమైన పవిత్రమైన జవాబు ఇదే.

ఇది స్వార్థం కావొచ్చు, కాని ఇందులో స్వారస్యం ఉంది.

ఇదంతా అబద్ధం అవవచ్చు, కాని ఇందులో ఔచిత్యం ఉంది.

# 2

నేను వీధిలో కూచుని ముందురోజు మిగిలిపోయిన ఫైల్సు చూసుకుంటున్నాను.

"ఏవండోయ్, ఒక్కసారి యిలా రారూ?" అని మా సుందరం అరిచింది. సుదీర్ఘమైన మా సాంసారిక జీవితంలో భయం కలిగించే సందర్భాలలో మా ఆవిడ వెనకాల దాక్కోడమే సాధారణంగా నాకు అల వాటు. ఇక మా సుందరం ధైర్యం ఎలాంటిదంటే — మా మూడో అబ్బాయి పుట్టిన తొమ్మిదో రోజు అనుకుంటా - ఆ పల్లెటూళ్ళో తల మాసిన వాడెవడో ఒక అర్ధరాత్రి కష్టపడి యింటికి కన్నం తవ్వి ఏ మాత్రం కన్నం పడిందో అని చెయ్యి దూర్చి చూశాడట—ఈవిడగారు అది గమనించి పక్కనే ఉన్న పసుపుదంచిన కర్రరోలు మెల్లిగా వాడి చేతిమీదకి దొర్లించి అందిమీద కూచుని నెమ్మదిగా ఒక్కొక్కర్ని లేపిన ఘటం! అలాంటిది ఆ అరుపులో ఏదో దైన్యం గోచరించి ఆవిడ, నూతి చప్టామీంచి అరిచింది గనక కొంపతీసి ఎవరైనా అవతలవైపునుంచి నూతిలో పడలేదుగదా అని ఆకాయితాలు వదిలేసి పెరట్లోకి పరిగెత్తేను. ఆ రోజుల్లో కలకత్తాకి ఈశాన్యంగా వందమైళ్ళ దూరంలో ఉన్నఆ వూళ్ళో మేం వున్న వీధిలో - ఇళ్ళు కొంచెం చిత్రంగానే ఉండేవని చెప్పవచ్చు. ఇళ్ళు, నీటి వంకాయ నిలువుగా చీరినట్టు పొడుగేగాని వెడల్పు ఉండేవికావు. రెలి స్కోపులా ఒక గదిలోంచి ఇంకో గదిలోకి అలావెళ్ళి పోవలసిందేగాని సైడ్ రూమ్సు అంటూ ఉండేవి కావు. ప్రతి రెండు ఇళ్ళకీ కామన్‌గా పెరట్లో ఒక నుయ్యి. దేనికది వేరే గిలక. మారెండు ఇళ్ళకీ మధ్య బాగా ఎత్తుగా గోడ ఉండడం చేత, మధ్య కిటికీలు ఉండే అవకాశం లేకపోవడం చేతా చెవులతోవిని తప్ప, కళ్ళతోచూసి పక్క ఇంట్లో ఏం జరుగుతోందో చెప్పడం బ్రహ్మతరం కాదు. అన్నిటినీ మించి వాళ్ళ భాషవేరు. వాళ్ళ ఆడవాళ్ళకి విపరీతమైన ఘోషా. మొగవాళ్ళు ఏ మాత్రమూ కలుపుగోరు మనుషులుకారు. నేను రెండు మూడుసార్లు ఇంగ్లీషులో అడిగిన ప్రశ్న లకి అతను అటువేపుతిరిగే జవాబు చెప్పేడు. పోనీ దాసీ వాళ్ళద్వారానైనా భోగట్టాలు లాగుదామనుకుంటే వాళ్ళకి దాసీ మనిషి లేదు. మేం

ప్రయత్నించినా దొరకలేదు. మా ఆవిడ ఏడుస్తూ, నన్ను తిట్టి కసితీర్చుకుంటూ, అంట్లు తోమడం తప్పలేదు.

అయితేనేం, ధ్వనుల్నిబట్టి వాసనలనిబట్టి ఆ ఇంట్లో ఏ క్షణం ఏం జరుగుతూందో చూసినట్టు పసిగట్టగల నేర్పరి మా ఆవిడ.

"అదిగో "చుయ్"మని పోపు చప్పుడు మీకు వినబడలేదూ? ఏ ఉప్మానో అయి ఉంటుంది. ఇంకో పావుగంటకి ఇంటాయన వస్తాడు. కాళ్ళు కడుక్కునేటప్పుడు నూతి దగ్గరచేసే చప్పుడు నాకు అలవాటేగా?"

"గుంటముండ ఏదో ఒకటి పడెయ్యమని గంట్రై కింక పెట్టింది, మీ చెవులేం గళ్ళడ్డాయా ఏమిటి వినపళ్ళేదూ? అదిగో గుబుకూ గుబుకూ దెబ్బలు—పాపం ఎలా కొట్టేస్తున్నారో...."

"ఏవండోయ్....కొంప మునిగింది బాబూ...కొంప మునిగింది, మళ్ళీ చేప పొయ్యిలో పడేసినట్టున్నారు. ఎందుకలా తెల్లబోయి చూస్తారు? మనం వంకాయ పులుసు పచ్చడి చెయ్యడానికి కాల్చినట్టు వీళ్ళు చేపని కుమ్ములో పెడతారు అనుకుంటాను. ఆ వాసన చూశారు"....నారాయణ పాహి....ఇంకో అరగంటసేపు మన ముక్కులు మనవి కావు....మన వాళ్ళు కాలికాలని దుంపని యివతలికి లాగినట్టు ఆ పిల్లలకీ ఉడికీ ఉడకని చేపతోక చప్పరించాలని ఉంటుంది కాబోలు! ఆ "కేరింతలు చూడండ దొంగ పీనుగలు" ఇలా, వినే వాళ్ళుండాలిగాని ఎప్పటికప్పుడు రన్నింగ్ కామెంటరీ ఇవ్వగలదు సుందరం.

"ఏమైందీ, ఎందుకలా అరిచావ్?" అన్నాను నే నానాడు ఆత్రుతగా.

"వేలెడు లేదు గుంటముండ. ఏం తప్పుచేసిందని దాని కింత శిక్ష చెప్పండి!" అంది అన్నీ కోల్పోయినట్టు మొహం పెట్టి.

పక్కంటి ఆఫీసరుకి ఇద్దరు పిల్లల్లా ఉన్నారు. పిలుపుల్నిబట్టి వాళ్ళ పేర్లు రవీ అనీ మాయా అనీ తెలిసింది. అస్తమానూ ఏడుపూ అదీ ఆ దొమ్మరి లంజ మా కాని ముండ దాన్ని రేవు పెడుతున్నారు కాబోలు.

"మీరోసారి వెళ్ళి ఆ మొగతనితో ఇంగ్లీషులో చెప్పి రాకూడదూ ఇదేం బాగులేదనీ?"

ఇంతకీ బాగులేని దేమిటో నాకు బోధపడి చస్తే గద. పిల్లని కొట్టి నట్టు నా కెక్కడా వినబడలేదు. నేను అడగ్గా సుందరం చెప్పింది. అంత చలికాలంలోనూ నిన్నగాక మొన్న కళ్ళు తెరిచిన పసిదానికి నూతి దగ్గిర నిల్చోబెట్టి చన్నీళ్ళ స్నానం చేయిం చేస్తున్నారట. అది చినుకు వంటి మీద పడేసరికల్లా నిప్పు చురక తగిలినట్టు కంయ్ కంయ్ మని అరుపులూ, తెయ్ తెయ్ మని గెంతులూట!

"ఇలా అయితే శైత్యంచేసి పిల్ల ఎన్నాళ్లో బతకదు" అంది సుందరం కన్నీళ్ళ పర్యంతమై.

"మరేం ఫరవాలేదు. ముండ నూరేళ్ళూ చూసేస్తుంది. రోజురోజుకీ చూశావుగదా గుమ్మడి గింజలా ఎలా తయారవుతోందో...."

సుందరాన్ని ఏడిపించాలని అన్నానేగాని ఈ వారంరోజుల్లోనూ మేం దాన్ని ఏ ఒకటి రెండుసార్లో తప్ప చూసిందేది? దిష్టిగొట్టి పోతుం దనో ఏమిటో వాళ్ళు పిల్లల్ని సాధారణంగా వీధిలోకి వదలరు. వదిలినా ఒళ్ళు కనబడకుండా ఒంటినిండా బట్టలు కట్టి మరీ వీధి అరుగు మీదకి తీసుకువస్తారు. రెండేళ్ళు వెళ్ళేయో లేదో దొంగ గాడిదకి, ఆ మాయా లోపలి లాగూ లేకుండా ఇవతలికి రావడం మేమెప్పుడూ చూడలేదు. పైగా మొగాడి మొగుడులాగ వెధవ ముండకి క్రాపింగు ఒకటీ....అన్నీ పోకిరీ వేషాలు...

"అయితే ఆ రవిగాడికి వేణ్ణీళ్ళుపోసి ఈ మాయాకి చన్నీళ్ళు పోస్తు న్నారన్నమాట....ఎంత అన్యాయం!" అన్నాను నేను.

మా ఆవిడ నా మీద విరుచుకుపడింది.

"మొగ వెధవకి ఏ నీళ్ళు పోస్తే ఎవడిక్కావాలి....నా ఏడుపంతా దీని కోసం....ఇంత చిన్న ముండ గదా...."

ఇంతకీ "మా సుందరం దృష్టిలో ఇంతింత మీసాలు తిరిగిన" ఆ పెద్ద మొగవెధవ రవి వయస్సు మరీ ఇంత కూచిముండ కంటె ఏడాది ఎక్కువ! వాడి వంటిమీద ఐస్ నీళ్ళు పడినా ఈ కరుణామయికి చీమ కుట్టినట్టు ఉండదన్నమాట!

ఎంత పక్షపాతం!

దీన్ని అర్థం చేసుకోవాలంటే మా గురించి కొంచెం వెనక్కి వెళ్ళి చెప్పుకోక తప్పదు.

# 3

అనగనగా ఒక రాజు.

ఆ రాజుకి ఏడుగురు కొడుకులు.

ఏడుగురు కొడుకులూ ఆడవేటకి వెళ్ళి చేప కన్నులుగల ఏడు గుర్నీ నమ్ముకుని ఏడు గుండెలూ ఎండ బెట్టుకున్నారు.

అందులో ఎండని గుండె అంటూ లేదు గనక ఆ పైన కథలేదు!

పిల్లల చదువులకి ఎక్కళ్ళేని సొమ్మూ చాలలేదు గనక రిటైరు అయినా రాజు మళ్ళీ ఉద్యోగం చెయ్యవలసి వచ్చింది.

ఆ రాజు మరెవరో కాదు, నేనే. నా పేరు సుబ్బరాజు కూడాను. మా అబ్బాయిలు కూడా మరేమంత దుర్మార్గులు కారు. ఇంకోళ్ళ పెళ్ళాన్ని కాకుండా ఎవరి పెళ్ళాన్ని వాళ్ళు నమ్ముకుని ఉన్నారు.

"నువ్వు అమ్మని నమ్ముకుని లేవా?" అని వాళ్ళంతరూ కలసి ఏక కంఠంతో అడిగినా నాకేం ఆక్షేపణ లేదు. అయితే మా సుందరం దుఃఖం కొడుకులు డబ్బెట్టలేదనీ కాదు, కోడళ్ళు చాకిరీ చెయ్యలేదనీ కాదు.

మా వాళ్ళ అందరి ఇళ్ళలోనూ చాలామంది సుబ్బరాజులు వెలి శారు గాని ఒక్క సుందరమ్మ అయినా దిగబడలేదు!

అయితే నాలుగోవాడి నట్టింట్లో పెద్ద కళ్ళ ఆడనలుసు ఒకటి నాలుగురోజులపాటు తళుక్ తళుక్ మనక పోలేదు.

అత్తగారిమీద కసికొద్దీ కోడలు మా వాడితో హోరాహోరీ పోరాడి పిల్లదానికి వాళ్ళమ్మ పేరు పెట్టేసుకుంది.

ఈగవాలితే జోడుచ్చుకు కొట్టే అభిమానవతి సుందరం.

"పదండి వెంటనే రైలెక్కేద్దాం" అంటుంది అనుకున్నాను.

అరికాలులో ముల్లు గుచ్చుకున్నంత సుళువుగా దాన్ని తీసిపారేస్తే నాకు చాలా ఆశ్చర్య మనిపించింది.

"ఆడపిల్లకోసం మొహంవాచిపోయాను. ఎందర్ని కన్నా బిక్కు బిక్కుమంటూ యిద్దరం మిగిలాం. సోమిదేవిని నాకియ్యి, పెంచు

కుంటాను" అని సుందరం అడగడానికి ఎటువంటి అవకాశమూ లేకుండా చేసింది కోడలు. కుర్రదాన్ని వదిలిపెట్టలేక సుందరమూ, ఈ వెర్రిదాన్ని వదిలి పెట్టలేక నేనూ, మా కాపరమే అక్కడికి ఎత్తి పెట్టేశాము చివరికి. అబ్బాయి మొహం చూసి ఆ నాలుగేళ్ళూ మేం అక్కడ గోళ్ళు గిల్లు కుంటూ కూచోక తప్పిందికాదు.

"నాన్నమ్మా నాన్నమ్మా నాకొంఛెం రొత్తిముక్క పెత్తవూ?" అన్న మనవరాలి చిలక పలుకులు సుందరానికి ప్రాణప్రదం. రాత్రిపూట ఒక్క చపాతీ తింటుంది సుందరం. అదయినా కోడలు "ఎలాగో అలా చేసి పడేస్తుంది." అదిగాక మా ఆవిడకి ఒకటీ ఒకటీ పళ్ళు ఊడుతున్నాయి. ఆ ఒక్కరొట్టీ అరగంటసేపు యింతింత ముక్కలు చేసుకుని ఎలాగో నానబెట్టుకు మింగుతుంది. తను తినేదానిలో మనవ రాలు వంతుకూడడం నాన్నమ్మకి స్వర్గానికి ఒక మెట్టు తక్కువగా ఉంటుంది.

"ఇందఁ. గబ గబా తినెయ్యి. అమ్మచూస్తే దెబ్బలాడుతుంది" అని ఇంత ముక్క దానిచేతిలో పెట్టేసరికి ఎక్కణ్ణుంచి వస్తుందో కోడలు, ఆ ముక్కని ఎగరగొట్టి కూతురి లెంప వాయగొడుతుంది.

పనీ పాటూ లేక ఒకరి ఇంట్లో చేరిన నేను గుర్తించే ఇలాంటి సంఘటనలు ఒకటా రెండా!

నా దగ్గిరికి కాపురానికి వచ్చిందగ్గర్నించీ సుందరానికి తమలపా కులు నవలడం అలవాటు. కుడివైపు దంతాలు రెండు పీకించుకున్న తర వాత, నేనైనా ఆ అలవాటు మానుకున్నానుగాని అది మానలేదు. మేకలా నవుల్తూ కూచుంటుందని కోడలుపిల్ల ఆడిపోసుకున్నా మావాడు దానికి తెలియకుండా కట్ట చెల్లగా కట్టతుని తమలపాకులు తెచ్చి తల్లికి ఇస్తూనే ఉన్నాడు. ఓ గంటసేపు తాంబూల సేవనం జరిగిన తర్వాత తయార యిన ఆ ఎర్రని ముద్దని నాన్నమ్మ నోటినుంచి అందుకోవడం సోమిదేవికి మహా ఇష్టం. ఎగుడు దిగుడైన ఆ నల్లటి పళ్ళనోటిలో తన కూతురు నోరు పెట్టడం కోడలికి పరమాసహ్యం. ఎన్నిసార్లు ఎన్ని విధాల మంద లించినా ఇద్దరూ ఆపని మానకపోతే మావాణ్ణి పురిగొల్పింది.

"ఎంగిలి అనీ, ఆరోగ్యానికి మంచిదికాదనీ రాజ్యం అభిప్రాయ పడుతోందే అమ్మా, పోనీ ఆ ఒక్కపనీ మానేసి చూడకూడదూ?" అని తల్లితో చెప్పలేక చెప్పలేక చెప్పేడు మా నాలుగో సుపుత్రుడు. తలకి బొప్పికట్టినంత సుళువుగా ఆ సంఘటననీ విదిల్చిపారవెయ్య గలిగింది సుందరం! దాన్ని గురించి నాతో కూడా ఒక్కముక్క అన లేదు. కిక్కురు మనకుండా ఓర్చింది, పైకి వినబడకుండా ఏడ్చింది. అంతే. చెంపలు కారిపోయేలా సోలెడు నూనె ఇంకించి కూతురికి అత్తగారు చింత పిక్క జడ వేస్తోందని పెద్ద కత్తెర తెచ్చి కోడలు పిల్ల, పిల్లదాని జుత్తు భుజాలదాకా కత్తిరించేస్తే గుడ్లనీరు కుక్కుకుని ఊరుకుంది సుందరం. అంతకన్న పెద్ద కత్తిరింపే జరిగింది ఆ రోజుల్లో ఒకసారి.

సోమిదేవి నాలుగో పుట్టిన రోజుకి - తనకు మిగిలిన ఒక్క జత గాజులూ అమ్మేసి, మువ్వల పట్టీలు చేయించింది సుందరం.

"ఎప్పట్నుంచో అనుకుంటున్నాను - ఆడపిల్ల అడుగుదీసి అడుగు వేసేనాటికే ఇలాంటివి అందియ్యావలసిన మాట. మెట్లెక్కుతూ, మంచాలూ, గోడలూ పట్టుకు నడుస్తూ, పడుతూలేస్తూ, గలగల గెంతుతూ, గిరగిర తిరుగుతూ చిట్టిచిట్టి అడుగులు వేస్తూ విద్దేలు చేస్తూవుంటే అయే రకరకాల శబ్దాలు వినటానికి ఎంత అదృష్టం వుండాలి!" అంది సుందరం నాతో. కాని నాకు తెలుసు, సోమిదేవి తిరుగాడవలసింది ఇల్లంతా కాదు, సుందరం గుండెలమీద! ఆ శబ్దానికి పరవశించేది ఆమె చెవులు కాదు, మనసు.

పుట్టినరోజునాడు తన చేతులతో తను మనవరాలికి పట్టీలు అలంక రించడానికి సుందరం ముందుకువస్తే, "నేను పెడతాలెండి, యిలా యివ్వండి" అని అడ్డేసింది కోడలు.

నాకు ఈ సందర్భంలో మధురమైన కథఒకటి జ్ఞాపకానికి వస్తుంది. ఒక బీదభక్తుడు అయిదేళ్ళపాటు కష్టపడి ఒక రాతి కిష్టుడికి వెండిగజ్జెలు చేయించాడట.

"నీకేం మతుందాపోయిందా? ఇన్నాళ్ళు చెమటోడ్చి కష్టపడి డబ్బు కూడబెట్టిగజ్జెలు చేయించావు. మర్రిచెట్టుక్రింది ఆవెర్రి రాతిబొమ్మ ఆగజ్జెలు పెట్టుకోవాలా, ఏడవాలా? ఏ దొంగాడో కొట్టేస్తాడు" అని అందరూ

వెక్కిరించారు. ఈ పరిహాసంలోని పరమ సత్యానికి భక్తుడు తట్టుకోలేక పోయాడు. వేణుగోపాలస్వామి ఆలయానికివెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చేడుట.

"ఇలా ఇయ్యి ఆ గజ్జెలు కట్టుకుంటాను" అని స్వామి గజ్జెలు అందుకుని ఆప్యాయంగా అలంకరించుకున్నారు.

"నువ్వు కాళ్ళకు కట్టుకోవని నా కెప్పుడూ అపనమ్మకంలేదుస్వామీ! కాని మా వాళ్ళంతా నా మాట నమ్మడంలేదు ... ఎలా?" అన్నాడు ఆ అమాయకుడు.

"పద, నీతోవచ్చి వాళ్ళకి నేను సాక్ష్యమిస్తాను" అన్నాడు ఆ మాయకుడు.

ఇంత మొహం చేసుకుని బయలుదేరాడు ఈ అమాయకుడు.

ఘల్లు ఘల్లు మంటూ వెనక భగవంతుడు అనుసరించాడు.

మాయదారి మాధవుడు మధ్యలో ఒక షరతు పెట్టాడు.

"నీవెనక నేను వస్తున్నాననే నమ్మకంతో నువ్వు ముందుకిసాగు. ఏ పరిస్థితుల్లోనూ వెనక్కి తిరిగి చూడకూడదు సుమా, అబ్బాయోయి!"

అలాగే అన్నాడు భక్తుడు.

చాలాదూరం వచ్చేశారు. ఇంకేముంది, ఆ సెలయేరు దాటితే కన బడే పెద్ద మర్రిచెట్టుకిందే స్వామి విగ్రహం వెలిసింది.

అంతవరకు వినిపిస్తున్న గజ్జెల చప్పుడు--ఒక్కమారుగా ఆగి పోయినట్టు అనిపించింది ఆ భక్తుడికి. ఇంతవరకూ వచ్చి స్వామి ఆగి పోయాడా? ఉండబట్టలేక వెనక్కి తిరిగి చూశాడు.

సెలయేటి గలగలలో గజ్జెల చప్పుడు కలిసిపోయి వినబడలేదుగాని స్వామి వస్తూనే ఉన్నాడు. అయితేనేం, అనుకున్న దానికి వ్యతిరేకంగా భక్తుడు వెనక్కి తిరిగి చూశాడుగా ! సెలయేటిలో ప్రతిఫలించే మేఘాల కాంతిలో స్వామి నీలదేహం కలిసిపోయినట్లనిపించింది. స్వామి మాయమై పోయాడు! తను చేసిన పొరపాటు మన్నించమని గుండె బద్దలయేలా ఏడ్చేడు భక్తుడు.

ఆ క్షణంలోనే మరొక చిత్రం జరిగిందిట.

మర్రిచెట్టుకింద రాతి కిష్టుడు కాళ్ళకి గజ్జెలువచ్చి మరి రాకుండా అతుక్కున్నాయి. ఊరివారందరూ భక్తుడి కాళ్ళమీద పాడ్డారుట.

కథలో నిజానిజాలు నాకు అనవసరం. అందులో భావం చాలా తీపి అయినది. మా సుందరానికి అనుభవమైనది.

గజ్జెలు పెట్టుకోకుండానే, గదులు నాలుగూ కలియతిరక్కుండానే, కన్నుమూసింది సోమిదేవి. పుట్టినరోజు మధ్యాహ్నం వచ్చిన మన్యపు జ్వరం. చచ్చినరోజు సాయంకాలానికిగాని శాంతించలేదు.

ఆ దెబ్బతో సుందరంకూడా వెళ్ళిపోతుందనుకున్నాను నేను.

కాని, పిల్లకోసం బెంగపెట్టుకుని, మా కోడలేమరి మంచం దిగ లేదు. దానికీ అదే జ్వరంవచ్చి పదహారోరోజు ప్రాణాలు విడిచింది.

"నా పిల్ల దగ్గిరకి నేను వెళ్ళిపోతున్నాను. మీరు అక్కడికీ సిద్ధమయి పోకండి" అన్నట్లు ఉన్నాయి చనిపోయే ముందు సుందరంవైపు కోడలు చూసిన చూపులు. మేం అక్కడ ఇంక క్షణం ఉండలేకపోయాము.

మళ్ళీ నేను ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యక తప్పలేదు.

## 4

"ఏమండీ, పెద్దపెట్టెలో కుడిచేతివైపు అడుగున మువ్వల పట్టీలు ఉన్నాయి, తీసి ఆ మాయాకి ఇవ్వకూడదూ?" అని.

"వద్దు వద్దు, పొరపాటున అన్నాను. నా చేతులు మంచివికావు, కుర్రదాన్ని పాపం అలాగే వుండనియ్యండి" అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుని సుందరం. మేం ఆ రోజుల్లో ఆ ఇంట్లో ఉన్నది కేవలం పది పదిహేను రోజులే. మళ్ళీ మేలుకున్న మమత రోజురోజుకీ తారాస్థాయిని అందు కొంటోందేగాని, మాయ ఒక్కనాడైనా, సుందరం దరిదాపులకి వచ్చిందేదీ ? ఒక్క కౌగిలి ఇవ్వలేదు. ఒక్క ముద్దు పెట్టుకో నివ్వలేదు. ఆఖరికి దూరం నుంచి ఒక్క నవ్వు అయినా విసరదు. అంత రణరాలుగాయి ఆ పిల్ల. పైగా వెక్కిరించడం, గుప్పెడు మన్నుతీసి విసరడం, కాలితో నేలమీద కొట్టి తంతాను జాగ్రత్త అన్నట్టు బెదిరించడం, అయినా సుందరం వ్యామోహం సుంతయినా తగ్గలేదు. రెండో కంటికి కూడా చత్వారంవచ్చి చీకటే కాకుండా ఎక్కువ వెలుగు కూడా ఓర్చలేని దృష్టి అమెది. లేచి గబగబా పది అడుగులువేస్తే

గుండె దడదడలాడే వయస్సు ఆమెది. అయినా మాయని చూడగానే సుందరం మళ్ళీ పదేళ్ళపిల్ల అయిపోయింది. నలుగురు అన్నలకి ముద్దూ ముచ్చటా తీర్చే చెల్లెలుగా పుట్టిన సుందరం-తనకి ఎత్తుకోడానికి చందనం బొమ్మతప్ప చెల్లెలు లేకపోయిందని చెప్పుకొనే వాళ్ళులేక దుఃఖపడిన సుందరం - ఏడు కానుపులయినా ఆడపిల్లల ముచ్చట తీరని సుందరం- మాయని చూడగానే మళ్ళీ మారాం మొదలుపెట్టింది.

ఏదో అడుదుం బుడుదుం నాలుగు పనులూ చక్కబెట్టి వీధి గుమ్మంలోకి వచ్చేస్తుంది. ఏ క్షణానికా క్షణం చావూపుట్టుకా అయిన రోల్డు గోల్డు కళ్ళజోడు వెదికి తెచ్చుకుని పెట్టుకుని, పక్క గుమ్మంవైపు ఆశతో చూస్తూ కూచుంటుంది. ఒకపట్టాన ఆ తలుపులు తెరుచుకోవు. గడియ తీస్తున్న చప్పుడు వినగానే అలసిపోయిన ఆమె గుండె తటతట కొట్టుకుంటుంది. రవీ, మాయా ఇవతలికొస్తారు.

వాళ్ళకోసం రోజూ ఏదో ఒకటిచేసి, ఏమీ లేకపోతే ఇంత బెల్లం ముక్కో, పంచదారో, అరటిపండో, దేవుడికి ఆరగింపు కోసమన్నట్టు సిద్ధంగా ఉంచుతుంచి. సుందరం చప్పట్లుకొట్టి పిల్లని పిలుస్తుంది. తన తొడమీద ఆ గుంటని కూచోపెట్టుకుని, అది గుటుకూ గుటుకూ మింగుతూంటే, కళ్ళల్లో కళ్ళుపెట్టుకు చూడాలని సుందరం కోరిక. కాని ఆ బోడి దానికి యిటువైపు మొహంతిప్పడం కూడా అట్టే యిష్టం వుండదు. శర వేగాన అన్నని, ఆ రవిగాణ్ణి తోలుతుంది. వాడు పరిగెత్తుకునివచ్చి దాచి పెట్టినట్టు సుందరం చేతిలోని తినుబడి వస్తువుని తన్నుకు పోతాడు. వెర్రి వెధవనిచేసి, వాణ్ణి రక్కి, గిల్లి, ఏడిచి, నేలమీదపడి దొర్లి, సర్వం స్వాధీన పరుచుకుంటుంది మాయ. ఈగోలకి మాయావాళ్ళ అమ్మో, అమ్మమ్మో తానే వస్తారు. చెరో చేత్తోనూ ఈ గుంట వెధవల్ని లోపలికి ఈడ్చి తలుపు గడియ పెట్టుకుంటారు. ఈ వెలుతురు కిరణాలు అట్టేసేపు పైన ఉండడం వాళ్ళ కిష్టం ఉండదు.

వెంటనే సుందరంలేచి మా మధ్య గదిలోకి వస్తుంది. ఆ వేళకి వాళ్ళూ అటువైపు మధ్య గదిలోకి వచ్చి సంగీత సాధన ఆరంభిస్తారు.

ఏ కూరలవాడి అమ్మకం కేకనో పట్టుకుని కుర్రాడు మొదట ఆలాపన మొదలుపెడతాడు. ఇంకో గడియకి కుర్రది శ్రుతి కలుపుతుంది.

పక్కనున్న ఏ అలమారా తలుపునో తీస్తూ వేస్తూ పక్కవాయిద్యం సమ కూర్చుకుని పిల్లలు సంగీత కచేరీ చేస్తారు. ఒకే ఒక ముక్క ఇద్దరూ కలిసి ఎన్ని సంగతులైనావేసి ఎంతసేపయినా సాగతీయగలరు. ఇక ఆ మాయ గొంతుక వినబడితేచాలు ఇవతలున్న సుందరానికి మరీ ఒళ్ళు తెలియదు.

ఇంద్దరు కొడుకుల్ని కన్నా ఈ వయస్సులో నేను పొట్ట చేత్తో పట్టుకుని వీధిని పడక తప్పలేదు. నేను తెచ్చే నూటపాతికా సుందరం మందులకి, పళ్ళకీ చాలదని నాకు తెలుసు. ఈ వయస్సులో దానిచేత చాకిరీ చేయించుకోడం న్యాయం కాదని నాకు తెలుసు. నడుం వంగి పోయినా అడుగువేస్తే ఆయాసమయినా ఆ మాయ గుంటని ఎత్తుకుని ఎక్కడికైనా పారిపోవాలని దాని మనసు ఉరకలు వేస్తోందనీ నాకు తెలుసు. కాని అశక్తుణ్ణి. దాన్ని ప్రేమించగలనుగాని నేనేం చెయ్యగలను! అయితే నేను చేసేది ఒకటి లేకపోలేదని ఆ తరవాత రోజు రుజువు చేసింది.

## 5

పక్కింటి ఆఫీసరు బావమరిది, మిద్నపూర్‌లో పనిచేస్తున్నాట్ట, రెండ్రోజులు సెలవు దొరికితే అక్కయ్య గారింటికి వచ్చాడు. అతను వీళ్ళలా కాదు. కాస్త కలుపుగోలు మనిషి. ఆ రోజు ఆదివారం అవడం మూలాన ఇంట్లోనే నేనూ ఉండిపోతే నా దగ్గిరకువచ్చి ఆ కబురూ ఈ కబురూ మొదలుపెట్టేడు. అతనూ నాలాగే ఇంగ్లీషు పేపర్లలోని చదరంగపు సమస్యలు పరిష్కరిస్తూ ఉంటాడు. దాన్తో మా ఇద్దరికీ బాగా కలిసింది. ఓ గంటా రెండుగంటలు హస్కుకొట్టి వెళ్ళిపోయాడు. మర్నాడు పొద్దున్న మా సుందరం నూతి దగ్గర స్నానం చేస్తుండగా నేను వీధి గదిలో పేపరు చూస్తుండగా అతను వచ్చాడు.

"మీకు గవర్నమెంటు ఆసుపత్రి డాక్టరు తెలుసునా ?" అను కుంటూ.

"ఎవరికేమయింది?" అన్నాను నేను ఆతృతగా.

"మరేం ప్రమాదం లేదులెండి. ఏముంది, పిల్లలు కదా ఎక్కడా కిందా మీదా ఉండరు. సమయానికి బావ క్యాంపుకి వెళ్ళడం ఒకటి."

మా ఇంగ్లీషు సంభాషణ చెవిలో పడినా సుందరానికి ఒక్కముక్క అర్థమయి ఉండదు. అసలే ఆ పిల్ల అంటే ప్రాణం. ఆ సంగతి [illegible] ఎక్కడ బెంగ పెట్టుకుంటుందో అని "అలా వెళ్ళివస్తాను, తలుపేసుకో" అని అతనితో బయలుదేరాను.

శ్రీ నగర్.

అతను నాలుగడుగుల్లు వేసి —

"ఉండండి, మాయాను తీసుకొస్తాను" అంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

నా గుండె గుబగుబలాడింది. [illegible]

వెర్రిమొహాలు వేసుకుని వీధిలోకి రవీ, వాళ్ళమ్మా వచ్చారు. అతను మాయాను ఎత్తుకుని యివతలి కొచ్చేడు.

తనకి ఏమీ జరగనట్టు మామయ్య చేతుల్లో కిలకిల కేరింతాలు కొడుతోంది. ఆ పంచ మహాపాతకి, మాయ, గుండెలు తీసిన బంటు.

గోచీ పెట్టుకునే చోట, ఎత్తుగా కట్టు ఉండడం చూసి—

"తొడ ఏమయినా చీరుకుపోయిందా మాయాకి?" అన్నాను నేను.

"ఆ సింగినాదం. మా అక్కయ్య కంగారుగాని ఆస్పత్రికి తీసి తెళ్ళవలసిన అవసరం ఏమీలేదు. అయినా ఆయువు పట్టు దగ్గర కనక చీము పొయ్యకుండా ముందు జాగ్రత్త తీసుకోడం ఒక విధంగా మంచిదే అనుకోండి."

"ఇంతకీ ఏం జరిగింది?"

"ఏముంది? రోజంతా ఒళ్ళు తెలియకుండా గెంతుతారేమో, దీపాలు పెట్టేసరికి ఒంటిమీద తెలివి ఉండదు కుర్రపీనుగులకి. ఇక ఆ నిద్రలో ఏం జరిగినా బోధపడదు వాళ్ళకి."

"ఏం జరిగిం దంటారు?" అన్నాను నేను సహనం కోల్పోయి కొంచెం గట్టిగానే.

"నిన్నటి రోజున అక్కయ్య కారప్పూస చేసిందిట. అది జేబులో పోసుకుని తింటూ, ఇంకా తిండి పూర్తికాకుండానే కళ్ళుమూతలు పడిపోయాయిట, కుర్రగాడిదలకి. ఓ రాత్రివేళ ఎలక ఒకటి మాయ నిక్కరు జేబులో దూరినట్టు కనబడుతోంది. ఆ కాస్త కారప్పూస పలుకులతోనూ ఆ మహమ్మారి కడుపు నిండలేదు కాబోలు. జేబుకి కన్నంచేసి, పక్కనే అందు బాటులో ఉన్న చిరుదొండని అందుకున్నట్టు ఉంది!"

నా నోట మాట రాలేదు.

"మాయ ఆడపిల్ల కాదూ?" అన్నాను మతిపోతున్న ఆశ్చర్యంతో.

"ఎవరన్నారు ఆడపిల్లని ? అందమైన ఆ కళ్ళుచూస్తే ఆడపిల్లే అనిపిస్తుంది అనుకోండి. నిజంగా ఆడపిల్లే అయితే ఓ పాతికేళ్ళు తేడా అయితే అయింది. నేను ఎగరేసుకు పోనూ?" అన్నాడతను నవ్వుతూ.

"మరి మాయా అని పిలుస్తా రేమిటి? అది ఆడ పేరు కాదా?"

"బలే బాగుందే మీతో! వాడి పూర్తిపేరు మాయాశంకర్ చటర్జీ. మా బావ నాన్నగారి పేరది...."

"మరి అప్పుడప్పుడు గౌను అదీ కడుతుండారు, తలకి రిబ్బను పెడతారు!"

"మా ఆఖరి అక్కయ్య కూతురు వీడి ఈడుదే. కిందటేడు దివాళీకి మేం ఆ ఊరు వెళ్ళినప్పుడు దాని రెండు గౌన్లు వీళ్ళ బట్టల్లో కలిసి పోయాయి. కూతురి ముచ్చట తీరక మా అక్కయ్య వీణ్ణి అప్పుడప్పుడలా అలంకరిస్తూ ఉంటుంది. ఎప్పుడూ ఈ బట్టలే వెయ్యమని మాయా ఉండుండి ఊరూవాడా ఏకం చేస్తూంటాడు కూడా. ఇంతకీ ఆసుపత్రి ఎటూ? మీరు మరీ పరధ్యానంగా ఉన్నట్టున్నా రే—"

నేను ఆసుపత్రికి ఎలా వెళ్ళివచ్చానో నాకేం గుర్తులేదు. ఈ కటిక సత్యాన్ని ఇముడ్చుకోలేక నా హృదయం గిలగిల కొట్టుకోడం నాకే ఆశ్చర్యమనిపించింది. ఇంతకీ మాయా మొగాడయితే నాకేం, ఆడదయితే నాకేం, అని నేను సరిపెట్టుకోలేక పోయాను. ఏమిటి చెప్మా కారణం అని ఆలోచించగా ఆలోచించగా ఆఖరికి నాకే జవాబు తోచింది. ఆడపిల్లలు లేని కొరత నేనే పూడ్చుకోలేక పోయాను. అంత అందమైనదీ మరొకటి లేదు. అంత అల్లరితో కూడినదీ మరొకటి లేదు-ఆడపిల్ల పెంపకం అదృష్టం ఎవరికో ఎందుకు, నాకేలేదు! గులాబీ పువ్వు అందాన్ని పరిశీలిస్తున్నప్పుడు అది ఆడపువ్వో, మొగపువ్వో, ఎవడిక్కావాలి? చల్లని వెన్నెల ఇచ్చే చందమామ ఆడదయితేనేం, మగవాడయితేనేం? ఆకాశంలో పిల్లిమొగ్గలు వేసే పావురం ఏ లింగానికి చెందితేనేం? - ఇలాంటి రీజనింగు నాకే సంతుష్టిగా లేదు. మాయ మొగాడన్న సంగతి ఏ విధంగా చూసినా నేనే భరించలేక పోయాను. అమాయకురాలైన సుందరం ఇదెలా భరించగలదు!

చెప్పకూడదు దానితో. చెప్పకపోతే ఎలాగ? ఈ పదిరోజులు ఈ సత్యం దాగడమే పరమాశ్చర్యకరం. ఆ మాయా వీధిలోకి వచ్చి వేలు మడచి నప్పుడు ఆ చిరుదొండ బయటపడక మానదు. దాగేదా యిది?

ఏవో వెయ్యి సాకులు చెప్పి నిలుచున్న పళాన యిల్లు మార్చేశాను నేను. మరి ఆరు నెలలకి నన్ను మరోచోటికి మార్చడంతో ఆ ఊరే వదిలేశాం మేం. కాని మేము ఏ ఊరు తిరిగి, ఏ అందమైన ఆడపిల్ల కన పడినా "మన మాయా ఇంతయి ఉంటుంది కదండీ" అంటుంది సుందరం. ఆ అందమైన ఆలోచన చెదరగొట్టడానికి నాకేం అధికారం ఉంది? అలాగే అంటాను నేను. వెర్రిది సుందరం. దాన్ని పిచ్చిదాన్ని చేసే ఆ రహస్యం చెప్పకపోతే ఏం!